అయిపోయాడు. మీదికి లంఘించి ముసిలివాడి గొంతు పట్టుకున్నాడు. ముసిలివాడు నవ్వు మానలేదు. రాణి వచ్చి లైటు వేసింది.

"మోసం చేశావు–" క్రౌర్యం నిండిన కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

"యిదిలి పెట్టోశ్! ఎర్రోడా?" శ్రీనివాసుల్ని విదిలించాడు 'నన్ను, నా పిల్లని పోషించుకోవడం మోసమా? నీకు మళ్ళే కడుపున కన్న పిల్లల్ని పోషించుకోనేక సచ్చిపోయి గతిమాలినోన్నవను."

శ్రీనివాసులికి షాక్ తగిలినట్టయింది.

"బతకాలంటే చాలా వున్నాయ్ దార్లు. కన్నపిల్లల్ని పోషించుకోడం శాతకాక పోతే సావమనా సదుంకున్న సిన్నోడా? అడుక్కు తినేనా బ్రతకాలి. నీ కోసరం కాదు. పిల్లల కోసం తెలిసిన్దా? ఏదో బతుకు బతికి జీయితం గడపాలి. దయిర్యం ఉండాలి. శావ కావాలి. యెల్లెల్లు నీకేది మంచిదని తోత్తే అరకంగా బతుకు. నాకుమల్లే మందు– పిల్ల ఏపారం పెట్టాలనుకుంటే పెట్టుకో, నేకపోతే ఆ గుమత్తా పనే సూసుకో యెల్లెల్లు! ఎర్రోడా! అంతేకాని సావమోక. మొగోడివి. ఇందాక నువు సేసిన గనకార్యానికి మొగోన్ననుకోమాక, నువ్వు సత్తే ఆ పిల్లలేమయిపోతారని ఆలోచించనేదేటి? యెల్లు!"

ముసిలివాడి ముఖంలో నవ్వు లేదు. చూపుల నైశిత్యం శ్రీనివాసులు వివశుణ్ణి చేసింది. అంతే - ఇక మారు మాట్లాడలేదు. రాణికేసి ఒక్క చూపు చూశాడు. వెనక్కి తిరిగి వీధినపడ్డాడు.

తెల తెల్లారుతోంది. పేరు తెలియని పక్షులు ఆకాశంలో అరుస్తున్నాయి. శ్రీనివాసులు గుండెలో మహారణ్యం తగులబడిపోతోంది.

శ్రీనివాసులు నడుస్తున్నాడు వేగంగా.

దార్లో చంకని పిల్ల నెత్తుకున్న, వేళాపాలాలేని ఓ ముష్టిది కనిపించి, "బాబూ! పిల్ల ఆకల్తో మండిపోతోంది. రెండ్రోజుల మట్టి తిండి నేదు. ధర్మం సెయ్ బాబూ!" అని అడిగింది.

శ్రీనివాసులు జేబులు తడుముకున్నాడు. ఖాళీ! ముందుకు నడిచాడు. నడక వేగం మరింత హెచ్చింది.

తను చావబోయి బ్రతికాడు.

తను చావకూడదు. బ్రతకాలి. పిల్లలకోసం - పిల్లలకోసం శ్రీనివాసులు

